సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం ; 24 ; ఆగస్టు ; 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.34

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.34, కనిష్టంగా రూ.27 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,105 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.3°/ 20.9°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆదర్శప్రాయుడు ఆంధ్ర కేసరి

- ప్రకాశం పంతులుకు నివాళులర్పించిన కలెక్టర్, ఎస్పీ



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం/పుట్టపర్తి టౌన్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శ ప్రాయుడని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని శనివారం కలెక్టరేట్‌లో, ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో టీఎస్ చేతన్ మాట్లాడుతూ, ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నట్లు గుర్తు చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో సైమన్ కమిషన్‌కు గుండెలు చూపిన ధీశాలి ఆంధ్రకేసరి అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, రాజకీయ వేత్తగా రాణించి ఆంధ్ర రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ఎనలేని కీర్తి తెచ్చారన్నారు. అంతకు ముందు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇక ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ రత్న... ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

'సాక్షి' విలేకరికి బెయిల్

కదిరి: టీడీపీ నాయకులు పెట్టిన తప్పుడు కేసుతో జైలు కెళ్లిన తలుపుల 'సాక్షి' విలేకరి రఘునాథరెడ్డితో పాటు ఇదే కేసులో నిందితుడిగా ఉన్న సుబ్బారెడ్డికి శనివారం జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకి వెళితే... తలుపుల మండలం రాజనోళ్లపల్లి సర్పంచ్ సుగుణమ్మ (వైఎస్సార్‌సీపీ మద్దతుదారు) ఈ ఏడాది జూలై 27న మధ్యాహ్నం తన ఇంట్లో నిద్రిస్తుండగా గ్రామానికి చెందిన నవీన్ (టీడీపీ) ఆమెను కత్తితో బెదిరించి మెడలోని బంగారు గొలుసు అపహరించుకుని వెళ్లారు. తర్వాత గ్రామస్తులందరూ అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దీన్ని అవమానంగా భావించిన నవీన్ అదేరోజు ఇంటి పక్కనే చెట్టుకు ఉరివేసుకున్నారు. అయితే టీడీపీ నాయకులు దీన్ని కూడా రాజకీయంగా వాడుకున్నారు. బాధితురాలు సుగుణమ్మతో పాటు విధి నిర్వహణలో భాగంగా వివరాలు సేకరించేందుకు వెళ్లిన తలుపుల మండల 'సాక్షి' విలేకరి రఘునాథరెడ్డితో సహా మరో 8 మందిపై తప్పుడు కేసు పెట్టారు. దీంతో పోలీసులు రఘునాథరెడ్డిని గత నెల 28న అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తంకదిరి సబ్‌జైలుకు తరలించారు. ఈ కేసులోనే శనివారం రఘునాథరెడ్డితో పాటు మరో వ్యక్తికి కోర్టు బెయిల్ ఇచ్చింది. ఇదే కేసులో మరికొందరు హైకోర్టును ఆశ్రయించగా.. వారికీ బెయిల్ మంజూరైంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త రమేష్‌పై కేసు

పుట్టపర్తి: దివ్యాంగుల పింఛన్ల తొలగింపును ప్రశ్నిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టుపెట్టిన బుక్కపట్నం మండలం నార్సింపల్లికి చెందిన పి.రమేష్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తపై బుక్కపట్నం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. బుక్కపట్నం టీడీపీ మండల కన్వీనర్ మల్లిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. కూటమి ప్రభుత్వం పలువురు దివ్యాంగుల పింఛన్లను తొలగించిందని రమేష్ పోస్టులు పెట్టారని... ఇందులో నిజం లేదని టీడీపీ నేత ఫిర్యాదు చేశారన్నారు.

టెన్షన్.. టెన్షన్

- 'మెరిట్' లిస్టు ప్రకటనతో డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ
- సెలెక్షన్ జాబితాపై మాత్రం స్పష్టత ఇవ్వని అధికారులు
- ఎంపికైన అభ్యర్థులకు నేరుగా మెసేజ్ వెళ్తుందంటూ ప్రచారం
- ఇదే జరిగితే అక్రమాలకు తావుంటుందంటున్న అభ్యర్థులు
- 25న సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ



గడువు ఏదీ?

అనంతపురం ఎడ్యుకేషన్/ పుట్టపర్తి: టీచర్ పోస్టులకు సంబంధించిన డీఎస్సీ–25 మెరిట్ జాబితాను విడుదల చేయడంతో అభ్యర్థులకు ఇప్పుడు 'కటాఫ్' టెన్షన్ మొదలైంది. శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో పీజీటీ, టీజీటీ మెరిట్ జాబితా విడుదల చేశారు. తర్వాత 11.30 గంటల పైన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ అభ్యర్థుల మెరిట్ జాబితాలను విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. జాబితాలను ప్రింట్ తీసుకున్న పలువురు అభ్యర్థులు తమకు వచ్చిన మార్కులు, ర్యాంకులపై లెక్కలు వేసుకుంటూ పోస్టు వచ్చే అవకాశాలపై తర్జనభర్జనలు పడుతున్నారు. ప్రధానంగా 'కటాఫ్' ఆయా కేటగిరీల్లో ఎక్కడికి ఆగిపోతుందనే అంశంపై అంచనాలు వేసుకుంటున్నారు. నోటిఫికేషన్, మంజూరు పోస్టులు, ఏ కేటగిరీకి ఎన్ని పోస్టులు కేటాయించారనే జాబితాతో తమకు వచ్చిన ర్యాంకులను పోల్చుకుంటూ కుస్తీ పడుతున్నారు. రిజర్వేషన్లు, లోకల్, నాన్‌లోకల్‌పై లెక్కలు కడుతూ అంచనాలు వేసుకుంటున్నారు. ముఖ్యంగా 'రిజర్వేషన్' అభ్యర్థుల్లో ఏ కేటగిరీలో రోస్టర్ ఎక్కడ మొదలై ఎక్కడ ఆగిపోతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. సెలెక్షన్ జాబితాపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు వెళతాయని చెబుతున్నారు. మెరిట్ జాబితా తరహాలోనే సెలెక్షన్ జాబితాలు కూడా ప్రదర్శించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

గతంలో మెరిట్ జాబితాలు ప్రకటించిన తర్వాత 15 రోజుల నుంచి మూన్నెళ్ల వరకు గడువు ఇచ్చి సెలెక్షన్ జాబితాలు ప్రకటించేవారని అభ్యర్థులు చెబుతున్నారు. కొన్ని డీఎస్సీల్లో మెరిట్ జాబితాలకు, సెలెక్షన్ జాబితాలకు ఆర్నెల్లకు పైగా గడువు ఉండిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడేమో రెండు రోజులు కూడా గడువు ఇవ్వకుండా సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధం చేస్తుండడాన్ని తప్పుపడుతున్నారు. మెరిట్ జాబితా పరిశీలించి తమకు పోస్టు వచ్చే అవకాశం ఉన్న రిజర్వేషన్ల అభ్యర్థులు కులం, ఆదాయం, స్టడీ తదితర సర్టిఫికెట్లు తెచ్చుకోవాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని వాపోతున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధం

ఉమ్మడి జిల్లాలో 807 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 25న అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాలలో జరగనుంది. జిల్లా పోస్టులతో పాటు జోనల్, రాష్ట్రస్థాయి పోస్టులకు ఎంపికైన జిల్లా అభ్యర్థులు కూడా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో శనివారం బాలాజీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన బృందాలకు శిక్షణ ఇచ్చారు. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్హత, కులం, ఆదాయం, స్థానిక ధ్రువపత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

నకిలీ సర్టిఫికెట్లు సమర్పిస్తే క్రిమినల్ కేసులు

డీఎస్సీలో భాగంగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన వారు నకిలీ సర్టిఫికెట్లు సమర్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని డీఈఓ ఎం.ప్రసాద్ బాబు హెచ్చరించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. 25న ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాల ఎంబీఏ బ్లాక్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. సమాచారం అందు కున్న అభ్యర్థులు వారికి కేటాయించిన టీంల వద్దకు వెళ్లి సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలన్నారు. అభ్యర్థులు వారి వ్యక్తిగత లాగిన్ ద్వారా https://apdsc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఇంటిమేషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. అంతకుముందే సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సంబంధిత పత్రాలన్నీ (అటెస్టెడ్ మూడు సెట్లు) ఒక ఫోల్డర్‌లో భద్రపరిచి ఫోల్డర్‌పై హాల్‌టికెట్ నంబరు రాసి అందజేయాలన్నారు.

డీఎస్సీలో అదరహో

అనంతపురం ఎడ్యుకేషన్: పోస్టులు తక్కువ, పోటీ ఎక్కువ. అయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో రంగంలో దిగారు. ప్రణాళిక ప్రకారం సన్నద్ధమై డీఎస్సీలో సత్తా చాటారు. ఎంత పెద్ద లక్ష్యమైనా, ఎంతమంది పోటీ ఉన్నా కష్టపడి చదివితే అన్నీ అధిగమించి విజేతలుగా నిలవచ్చని నిరూపించారు. వివిధ కేటగిరీ పోస్టుల్లో జిల్లా టాప్ ర్యాంకర్లుగా నిలిచి ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.

పేరు	సబ్జెక్టు	మార్కులు	ర్యాంకు
టీ.మాధవి	ఎస్‌ఏ (ఇంగ్లిష్)	86.48	1
బండి ఉదయ్‌కుమార్	ఎస్‌ఏ (ఇంగ్లిష్)	85.89	2
అవిలిగొండ సిద్ధార్థ	ఎస్‌ఏ (ఇంగ్లిష్)	84.90	3
గవ్వల బాలచంద్ర	ఎస్‌ఏ (తెలుగు)	84.92810	1
గంధం అశోక్‌కుమార్	ఎస్‌ఏ (తెలుగు)	83.88762	2
ఎన్.ఆదినారాయణ	ఎస్‌ఏ (తెలుగు)	83.87810	3
గొల్లపల్లి పవన్ నారాయణ్ కౌసిక్ శాస్త్రి	ఎస్‌ఏ (హిందీ)	84.03	1
సిద్ధవటం శివలక్ష్మి	ఎస్‌ఏ (హిందీ)	82.68	2
గుజ్జల అమృతవాణి	ఎస్‌ఏ (హిందీ)	79.52	3
జే.గౌషియా ఖానమ్	ఎస్‌ఏ (ఉర్దూ)	80.67	1
హెచ్.హసీనాబేగం	ఎస్‌ఏ (ఉర్దూ)	79.93	2
పటాన్ సర్దారున్నీసా	ఎస్‌ఏ (ఉర్దూ)	78.37	3
గౌని మధు	ఎస్‌ఏ (బీఎస్)	88.52081	1
వంగలపల్లి దేవరాజు	ఎస్‌ఏ (బీఎస్)	87.32997	2
దేవరపల్లి రాజ్‌కుమార్	ఎస్‌ఏ (బీఎస్)	84.60456	3
తలారి సురేష్	ఎస్‌ఏ (పీఎస్)	87.95	1
కట్టా సురేష్‌బాబు	ఎస్‌ఏ (పీఎస్)	83.25	2
కురుడి వాసుదేవరావు వేదవ్యాస	ఎస్‌ఏ (పీఎస్)	83.23	3
పొరాల మంజుల	ఎస్‌ఏ (గణితం)	87.89529	1
ఈ.చంద్రమౌళి	ఎస్‌ఏ (గణితం)	86.49529	2
పసుపులేటి లక్ష్మీదేవి	ఎస్‌ఏ (గణితం)	84.19498	3
పలమాసి అమరేష్	ఎస్‌ఏ (సోషల్)	88.89893	1
సపారే వెంకటేశులు	ఎస్‌ఏ (సోషల్)	85.58793	2
బులగుండ్ల జ్యోతి	ఎస్‌ఏ (సోషల్)	84.58622	3
భజంత్రి ఉమామహేష్	ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	92.5	1
కలమ్మగారి సురేష్‌బాబు	ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	92	2
ఉడమాల నరేష్	ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	88.5	3
చింతా దివ్యశ్రీ	ఎస్జీటీ తెలుగు	92.79653	1
ఉక్కిసాల సాయికుమార్	ఎస్జీటీ తెలుగు	92.70949	2
గంజి రాశి	ఎస్జీటీ తెలుగు	92.46732	3
పఠాన్ టోపీవలి	ఎస్జీటీ ఉర్దూ	74.97	1
రఫియా ఖానమ్	ఎస్జీటీ ఉర్దూ	74.57	2
నదిమిమజిద్ ఉజ్మా కౌషర్	ఎస్జీటీ ఉర్దూ	74.00	3
నీరుగంటి నాగరాజు	ఎస్జీటీ కన్నడ	73.77	1
కలేకుర్తి యశోద	ఎస్జీటీ కన్నడ	66.73	2
గొల్లరాళ్లి సురేష్	ఎస్జీటీ కన్నడ	66.63	3

దివ్యాంగులను ఏడిపింఛన్



ఇతని పేరు అక్కిం అంజన్‌కుమార్. బత్తలపల్లికి చెందిన ఇతను పుట్టుకతో దివ్యాంగుడు. వీల్‌చైర్‌కే పరిమితమై.. కనీసం నిలబడలేడు. తన పనులేవీ చేసుకోలేడు. ఏళ్లుగా దివ్యాంగ పింఛన్ ద్వారా అందే మొత్తంతోనే జీవనం సాగిస్తున్నాడు. కానీ అధికారులు ఇటీవల ఆయన వైకల్య శాతం తగ్గించి పింఛన్ రద్దు చేస్తూ నోటీసులిచ్చారు.

..ఇలా ఎందరో దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం ఇటీవల రద్దు చేస్తూ నోటీసులిచ్చింది. దీనిపై పింఛన్‌దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమను చూసైనా అధికారులు మానవత్వంతో ఆలోచించి పింఛన్ పునరుద్ధరించాలని కోరుతున్నారు.

- పునఃపరిశీలన పేరుతో వేలాది పింఛన్ల రద్దు
- వైకల్య శాతం తగ్గించడంపై లబ్ధిదారుల మండిపాటు
- రీవెరిఫికేషన్‌కు భారీగా అందుతున్న దరఖాస్తులు
- ముఖం చాటేసిన కూటమి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు
- సోమవారం కలెక్టరేట్ వద్ద భారీ ధర్నాకు దివ్యాంగుల పిలుపు



పింఛన్ తొలగించారంటున్న పెదపల్లికి చెందిన భూదేవి



83 శాతం వైకల్యం ఉన్నా.. పింఛన్ తొలగించారని సదరం సర్టిఫికెట్ చూపుతున్న ఎన్‌పీకుంట మండలం టీఎన్ పల్లికి చెందిన సరస్వతి

పుట్టపర్తి అర్బన్: పింఛన్ మొత్తంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న ఎందరో దివ్యాంగుల పట్ల కూటమి సర్కార్ నిర్దయగా వ్యవహరించింది. మంచాలకు పరిమితమైన వారు.. నడవలేని పరిస్థితుల్లో ఉన్న వేలాది మందికి వైకల్య శాతం తగ్గించి పింఛన్ రద్దు చేస్తూ నోటీసులిచ్చింది. దీనిపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామగిరి, ధర్మవరం, బత్తలపల్లి, పెనుకొండ, హిందూపురం తదితర ప్రాంతాల్లో రాజకీయ కక్షతో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులైన అర్హులకు పింఛన్ అందకుండా చేయడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

7,163 పింఛన్ల రద్దు..

జిల్లాలో 34,967 మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఉన్నారు. కూటమి సర్కార్ 'పునఃపరిశీలన' పేరుతో వీరందరినీ ఆస్పత్రులకు పంపింది. అయితే చాలా ప్రాంతాల్లో వైద్యులు కనీసం దివ్యాంగులను పరిశీలించకుండానే ప్రక్రియ పూర్తి చేశారు. వైకల్య శాతాన్ని ఇష్టానుసారంగా నమోదు చేశారు. దీంతో వైకల్య శాతం 40 శాతంలోపు నమోదైన 7,163 మంది పింఛన్లను తొలగిస్తూ ప్రభుత్వం లబ్ధిదారులకు నోటీసులిచ్చింది. ఇక రూ.15 వేలు, రూ.10 వేల పింఛన్ మొత్తం తీసుకుంటున్న మరో 8 వేల మందికి వైకల్య శాతం తగ్గించింది. వీరందరికీ పింఛన్ మొత్తం తగ్గే అవకాశం ఉంది. దీంతో వారంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖం చాటేసిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు..

ఆగస్టు 15వ తేదీ తర్వాత పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్ రద్దు నోటీసులు ఇచ్చారు. అప్పటి నుంచి ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు, నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌లు ముఖం చాటేశారు. నియోజక వర్గాల్లో అందుబాటులో ఉంటే దివ్యాంగులు కార్యాలయాలకు వచ్చి ఇబ్బంది పెడతారన్న కారణంతో కనిపించకుండా తిరుగుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామాల్లో తిరగలేని పరిస్థితి నెలకొందని, ఈ పరిస్థితుల్లో 'స్థానిక' ఎన్నికలకు ఎలా వెళ్లాలో తెలియడం లేదని ఓ ప్రజాప్రతినిధి ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా..

కూటమి సర్కార్ చర్యను నిరసిస్తూ వేలాది మంది దివ్యాంగులు వికలాంగ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ సోమవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్ వద్ద భారీ ధర్నాకు సిద్ధమయ్యారు. ఈ మేరకు దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షఫీ, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ఉమ్మడి జిల్లా ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కో ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలో పింఛన్ కోల్పోయిన దివ్యాంగులు, వైకల్య శాతం తక్కువగా నమోదైన దివ్యాంగులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1వ తేదీ అర్హులకు పింఛన్ మొత్తం అందించకపోతే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లు ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

నేర నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- పెండింగ్ కేసుల దర్యాప్తునకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వండి
- చవితి ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి
- క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ నిరోధంపై దృష్టి సారించండి
- నేర సమీక్ష సమావేశంలో పోలీసులకు ఎస్పీ రత్న ఆదేశం



ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎస్పీ రత్న పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ కేసుల దర్యాప్తునకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శనివారం ఆమె జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నేర సమీక్ష నిర్వహించారు. సబ్ డివిజన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ కేసుల ఛేదింపుల్లో కృషి చేసిన పోలీసులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కేసుల దర్యాప్తులో సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళలు, బాలికలపై నేరాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలు, పాఠశాలలు వద్ద శక్తి టీం ద్వారా ఈవ్‌టీజింగ్ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపండి

బెట్టింగ్‌పై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ రత్న పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా జిల్లాలో ఎక్కడా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల్లో నిందితులను పట్టుకునేందుకు స్పెషల్ టీంలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచాలని, రాత్రి సమయాల్లో గస్తీలు ముమ్మరం చేసి చోరీల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించాలన్నారు. పోక్సో కేసుల్లో నివేదికలు త్వరగా సిద్ధం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలను పూర్తిగా కట్టడి చేయాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలను తరచూ సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకుంటూ ఉండాలన్నారు. అలాగే పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణస్వామి, మహేష్, హేమంత్‌కుమార్, నర్సింగప్ప, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఐటీకోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసేందుకే ప్లాన్ చేశారా!

- ఎంపీపీ పురుషోత్తమరెడ్డిపై హత్యాయత్నం వెనుక సూత్రధారులెవరు.. ?
- 'పురం' నియోజక వర్గంలో జోరుగా సాగుతున్న చర్చ

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికారం చేతుల్లో ఉంది... అడిగేవారు లేరు... అందుకే హిందూపురం నియోజక వర్గంలో 'పచ్చ' బ్యాచ్ రెచ్చిపోతోంది. ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ భయాందోళనలకు గురిచేస్తోంది. ప్రజల పక్షాన నిలిచే నాయకులను అంతం చేసేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డిపై హత్యాయత్నం చేశారు. వాస్తవానికి ఆయన్ను అంతంచేసేందుకే ప్లాన్ చేసినా అది బెడిసికొట్టినట్లు తెలుస్తోంది. ఈ కేసులో పాత్రధారులు కనబడుతున్నా... ఎంపీపీ మర్డర్‌కు స్కెచ్ వేసిన సూత్రధారులు ఎవరన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

వైఎస్సార్ సీపీ నేతలే టార్గెట్..

చిలమత్తూరు మండలంలో కొందరు టీడీపీ నేతల ఆగడాలు శ్రుతిమించిపోయాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని చెలరేగిపోతున్నారు. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడటం, బెదిరింపులకు దిగడం, అక్రమ కేసులు పెట్టించడం పనిగా పెట్టుకున్నారు. టీడీపీ నేతల్లో ముఖ్యంగా కొందరు దోపిడీలకూ తెగిస్తున్నారు. అడ్డం వస్తే బెదిరింపులకు దిగుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దాడులను ప్రోత్సహిస్తూ హత్యారాజకీయాలకు దిగడంతో సామాన్యులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



గతేడాది జూలై 24 న ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోలీసులను బెదిరిస్తున్న నాగరాజు యాదవ్, బాబూరెడ్డి తదితరులు

తెరవెనుక సూత్రధారులు ఎవరు...?

ఎంపీపీ పురుషోత్తమరెడ్డిపై జరిగిన హత్యాయత్నంలో అసలు సూత్రధారులు వేరే ఉన్నట్టుగా తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎంపీపీ పురుషోత్తమరెడ్డిని సర్వసభ్య సమావేశాలకు రానివ్వకుండా జెడ్పీటీసీ మామ నాగరాజు యాదవ్, బాబూరెడ్డితో పాటు పలువురు టీడీపీ నేతలు ఇబ్బందులకు గురిచేశారు. గతేడాది జూలై 24 వ తేదీన ఎంపీడీఓ కార్యాలయం ముందే నాగరాజు యాదవ్ హల్‌చల్ చేశాడు. ఎంపీపీని మండలంలో అడుగుపెట్టనివ్వబోమని హడావుడి చేశాడు. అడ్డువచ్చిన పోలీసులతోనూ దురుసుగా ప్రవర్తించాడు. అప్పటికే ఎంపీపీ, బాబూరెడ్డి ఓ కేసులో అరెస్టు కాగా ఎంపీపీ బెయిల్‌పై బయటకు వచ్చాడు. బాబూరెడ్డి మాత్రం బెయిల్ తీసుకోకుండానే బయటకు వచ్చి హంగామా చేశాడు. అప్పటి నుంచి పోలీసుల భద్రత నడుమ ఎంపీపీ సర్వసభ్య సమావేశాలకు హాజరై వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో కొద్ది నెలలు స్తబ్ధతగా ఉన్న మండలంలో మళ్లీ ఎంపీపీపై హత్యా ప్రయత్నం కలకలం రేపుతోంది. ఈ దాడి వెనుక బాబూరెడ్డి ఆయన అనుచరులు ప్రత్యక్ష సూత్రధారులు కాగా, పరోక్షంగా మండలంలోని కీలకమైన టీడీపీ నేత ఉన్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎంపీపీకి ప్రాణహాని..

ఎంపీపీ పురుషోత్తమరెడ్డికి ప్రాణహాని ఉందని, పూర్తి భద్రతతోనే గ్రామంలోకి వెళ్లాలని పోలీసులు కూడా హెచ్చరించారు. ఇప్పటికే గ్రామంలో పోలీసులు పికెటింగ్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఎంపీపీ తన స్వగ్రామమే కదా అన్న ఏమరుపాటుగా ఉండటంతో శుక్రవారం ఆయనపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.


అలంకరణలో శనీశ్వరస్వామి


స్వామి దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు


ఆలయంలో నిర్వహిస్తున్న పూజలో పాల్గొన్న భక్తులు

శనీశ్వరా.. పాహిమాం

పావగడ: స్థానిక స్వర్ణ శనీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని చివరి శ్రావణ బహుళ అమావాస్య శనివారం శని వారోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూలో నిల్చుని స్వామివారిని దర్శించుకున్నారు. తమను వెంటాడుతున్న శని దోషాలను నివారించి కష్టాల నుంచి కాపాడాలని వేడుకున్నారు. దీక్షా మంటపంలో తల నీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నవ గ్రహ పూజలకు భక్తులు పోటెత్తారు. పలువురు ఆర్య వైశ్య వ్యాపారులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ సమితి అధ్యక్షుడు అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు లాయర్ వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి సుబ్బనరసింహ తదితరులు భక్తులకు సేవలందించారు.

క్లుప్తంగా

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి


లక్ష్మన్న

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన మాజీ స్టోర్ డీలర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న తనకు ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించాలని రాప్తాడు పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాలమేరకు.. ఈ ఏడాది మే 14న పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐ సార్‌ను కలవాలని తనకు ఫోన్ వచ్చిందన్నారు. తాను పోలీసుస్టేషన్ లోపలికి వెళ్తుండగా.. రాప్తాడుకు చెందిన మారుతీ, నారాయణ, జగదీష్‌లు పోలీస్‌స్టేషన్ ముందే తనపై దాడి చేశారన్నారు. ఎందుకు కొడుతున్నారని అడిగినా చెప్పలేదన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని అప్పట్లో ఫిర్యాదు చేసినా నేటికీ పోలీసులు స్పందించలేదన్నారు.

నిన్ను కొడితే దిక్కెవరు?

తాజాగా శనివారం సాయంత్రం ఎస్సీ కాలనీలోని తన ఇంటి ముందు కూర్చొని ఉండగా గతంలో దాడి చేసిన నారాయణ మళ్లీ దాడికి యత్నించాడని లక్ష్మన్న ఆవేదన వ్యక్తం చేశారు. బండి ఎక్కు .. నీతో పని ఉందని బూతులు తిట్టారన్నారు. కొడితే దిక్కెవరని, పోలీసులు కూడా మేమంటే భయపడతారన్నారన్నారు. నారాయణ నుంచి తప్పించుకొని, వచ్చి నారాయణ, మారుతీ, జగదీష్‌ల నుంచి తనకు ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించాలని మరోసారి పోలీసులను వేడుకున్నానని లక్ష్మన్న తెలియజేశారు.

సమష్టి కృషితో 'స్వచ్ఛత'


స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: సమష్టి కృషితోనే 'స్వచ్ఛత' సాధ్యమవుతుందని, అందువల్ల ఎవరికి వారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు నిచ్చారు. 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం పుట్టపర్తిలో విద్యార్థులు, అధికారులు, మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక సత్యమ్మ ఆలయం వద్ద కలెక్టర్ చేతన్ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ మున్సిపల్ కార్యాలయం మీదుగా చిత్రావతి బ్రిడ్జి వరకూ సాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లాను స్వచ్ఛతలో తొలిస్థానంలో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కొంత సమయం కేటాయించాలన్నారు. వర్షాకాలంలో కలిగే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు.

నాకే నమస్తే పెడతావా ?

- మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌పై సీఐ రాజగోపాల్‌నాయుడు దాష్టీకం



గాయపడిన ఆసిఫ్‌వుల్లా, వన్‌టౌన్ పీఎస్ ఎదుట ఆందోళనకు దిగిన వేణురెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చిలమత్తూరు: గౌరవంగా నమస్తే పెట్టిన పాపానికి ఓ కౌన్సిలర్ పోలీసు దాష్టీకానికి బలయ్యాడు. వివరాల్లోకెళితే.. హిందూపురం మున్సిపల్ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్‌వుల్లా శనివారం రాత్రి పట్టణంలోని అల్‌హిలాల్ కాంప్లెక్స్ వద్ద తన బట్టల దుకాణం వద్ద నిల్చొని ఉన్నారు. అటు వైపు నుంచి సీఐ జీపు రాగానే నమస్తే పెట్టారు. దీనికి ఆగ్రహించిన సీఐ రాజగోపాల్‌నాయుడు.. నాకే నమస్తే పెడతావా అంటూ ఆసిఫ్‌వుల్లాను కొట్టడంతో పాటు స్టేషన్‌కు లాక్కెళ్లారు. ఏం నేరం చేశానని ప్రశ్నించిన పాపానికి దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి , కౌన్సిలర్ శివ, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకొని పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. వేణురెడ్డి మాట్లాడుతూ సీఐ ఆగడాలు మితిమీరిపోయాయని, వెంటనే ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉదయం రెక్కీ .. రాత్రి దొంగతనం

- తాళం వేసిన ఇళ్లే వారి టార్గెట్
- ఇద్దరు అంతరాష్ట్ర దొంగలు అరెస్టు
- రూ.9 లక్షలు విలువైన బంగారు ఆభరణాల స్వాధీనం


అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చూపుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం అర్బన్: ఉదయం రెక్కి నిర్వహిస్తారు. రాత్రి దొంగతనం చేసేస్తారు. తాళం వేసిన ఇళ్లే వారి టార్గెట్. ఇంటికి తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేసి ఆ బంగారాన్ని బెంగళూరులో విక్రయించే అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన పాల్తూరి రామకృష్ణ అలియాస్ బాలరామకృష్ణన్ తమిళనాడు రాష్ట్రం వేలూరులో నివసిస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా పన్నసముద్రం పంచాయతీ అచ్చంపల్లికి చెందిన భగవంతపు రామంజినప్ప ఇద్దరూ కలిసి ధర్మవరం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు తలుపులు పగలకొట్టి దొంగతనాలు చేసేవారు. రాత్రి సమయాల్లో మహిళల మెడలో బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కోవడం చేసేవారు. ఇద్దరు దొంగలపై ఇప్పటికే పావగడ పోలీస్ స్టేషన్, ధర్మవరం వన్ టౌన్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదైనట్లు చెప్పారు. వారిద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటికే ఇద్దరు దొంగలు దొంగతనం కేసులో కొయంబత్తూర్, అనంతపురం జిల్లాలో శిక్ష అనుభవించారని తెలిపారు. జైలులో ఉన్న సమయంలో ఈ దొంగలు పరిచయం పెంచుకుని బయటకు వచ్చిన అనంతరం దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దొంగలను పట్టుకోవడంలో వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, టూటౌన్ సీఐ రెడ్డప్ప, హెడ్‌కానిస్టేబుల్ అప్పస్వామి, కానిస్టేబుళ్లు రాజప్ప, షాకీర్‌లు చొరవ చూపారని వారిని డీఎస్పీ అభినందించారు.

'జీపీఎఫ్' లోపాలు సవరించాలి

పుట్టపర్తి: జనరల్ ప్రావిడెంట్ ఫంట్ ఖాతాల్లో తలెత్తిన లోపాలను ప్రభుత్వం వెంటనే సవరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చాలా మంది ఉపాధ్యాయుల ఖాతాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో లోపాలు ఉన్నాయన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి కొంత మంది ఉపాధ్యాయులకు అప్‌డేషన్ కాలేదని, మరికొందరు ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో క్రెడిట్ తప్పుగా చూపుతోందన్నారు. వెంటనే వాటిని సవరించాలన్నారు.

ఆలయాల్లో దొంగతనం


గీతా మందిరంలో దొంగలు ధ్వంసం చేసిన హుండీ

నల్లచెరువు: మండల కేంద్రంలోని గీతామందిరం, మార్కండేయస్వామి ఆలయాల్లో దొంగలు హుండీలు ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు. స్థానికుల వివరాలమేరకు.. కె.పూలకుంట రోడ్డులోని గీతా మందిరం, మార్కండేయస్వామి ఆలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హుండీలు ధ్వంసం చేశారు. అందులోని సుమారు రూ. 40 వేలకు పైగా నగదును ఎత్తుకెళ్లారు. ఆలయ అర్చకులు శనివారం ఉదయం ఆలయంలో దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన జరిగిన ఆలయాలను పరిశీలించారు.

వీరభద్రుడి సేవలో డిప్యూటీ సీఈఓ

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని శనివారం కేంద్ర ఖాదీ, గ్రామీణ చేతివృత్తుల కమిషన్ డిప్యూటీ సీఈఓ మదన్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించడంతో పాటు వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. లేపాక్షిలో ఖాదీ, గ్రామీణ చేతి వృత్తుల ఎంపోరియం ఏర్పాటు చేయాలని అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు సీఈఓకు విన్నవించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

- తన భార్యపై కన్నేసిన తమ్ముడిని హతమార్చిన అన్న
- రెండు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసులు


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం అర్బన్: పట్టణంలో రెండురోజుల క్రితం జరిగిన మెకానిక్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. తన భార్యపై కన్నేసిన తమ్ముడిని అన్న హత్య చేశాడని డీఎస్పీ హేమంత్‌కుమార్, వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేతిరెడ్డి కాలనీ ఎల్–2కి చెందిన పాళ్యం శివయ్య పిన్నమ్మ కుమారుడు కేతిరెడ్డి కాలనీ ఎల్–3కి చెందిన పాళ్యం ధనుంజయ అన్నదమ్ములు. ఇద్దరూ స్నేహంగా ఉంటూ మద్యం సేవించేవారు. ధనుంజయ తన అన్న శివయ్య భార్యపై కన్నేసి ఆమెతో పలుమార్లు చెడుగా ప్రవర్తించేవాడు. చాలాసార్లు శివయ్య... ధనుంజయను మందలించాడు. అయినా ధనుంజయలో మార్పు రాలేదు. దీంతో ఈనెల 21న అర్ధరాత్రి సమయంలో ఎల్‌పీ సర్కిల్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఓపెన్ జిమ్ వద్ద ధనుంజయను సిమెంట్ ఇటుకతో పాటు బండ రాయితో దాడి చేసి హత్య చేశాడు. పరారీలో ఉన్న శివయ్యను అరెస్టు చేశామన్నారు.

కియా కంటైనర్లను ఆపిన 'తమ్ముళ్లు'

- పోలీసులు వస్తున్నారని పరార్

పెనుకొండ: కియా కార్ల పరిశ్రమ వద్ద ఉన్న పలు అనుబంధ సంస్థలకు తయారీ సామగ్రిని తీసుకువెళ్లే పలు కంటైనర్లను టీడీపీ నాయకులు దౌర్జన్యంగా ఆపారు. అయితే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటున్నారన్న సమాచారం తెలియడంతో అక్కడి నుంచి జారుకున్నారు. శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. కియా కార్ల పరిశ్రమకు అనుబంధంగా ఉన్న పరిశ్రమల్లో తమకు వాటాలు ఇవ్వాలని, నిర్వహణ బాధ్యతను ఇతర కాంట్రాక్ట్ పనులను తమకు అప్పగించాలని పరిశ్రమల యాజమాన్యాలను, కంటైనర్లు, ఇతర వాహనాల యజమానులను కొద్ది రోజులుగా టీడీపీ నాయకులు ఇబ్బంది పెడుతున్నారు. ఇందులో భాగంగానే ఐదుగురు నాయకులు కారులో దుద్దేబండ సమీపంలో ఉన్న ట్రైనింగ్ సెంటర్ మెయిన్ గేటు ముందు నిలబడి కంటైనర్లను నిలిపారు. బెదిరింపు ధోరణిలో మాట్లాడుతుండగా పోలీసులు అక్కడికి చేరుకుంటున్నట్లు తెలియడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఎస్ఐ రాజేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా కారులో ఐదుగురు నాయకులు వెళ్లారని, కంటైనర్లు ఆపిన సంగతి తెలుసుకొని అక్కడికి వెళ్లే లోపే వెళ్లిపోయారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు. కియా పరిధిలో జరుగుతున్న ఘటనలపై మంత్రి లోకేష్ హెచ్చరించినా టీడీపీ నాయకులు లెక్కచేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.

డీఎస్సీలో సత్తాచాటిన ధర్మవరం అభ్యర్థులు

- జిల్లా ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం


దివ్యశ్రీకి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు


సాయికుమార్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ధర్మవరం అర్బన్: డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో ధర్మవరం అభ్యర్థులు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చింతా పరమేశ్వర్, చింతా పద్మావతి దంపతుల కుమార్తె దివ్యశ్రీ డీఎస్సీ ఎస్‌జీటీ పరీక్ష ఫలితాల్లో 92.79 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. దివ్యశ్రీ పదో తరగతి, ఇంటర్ ధర్మవరంలో చదివి టీటీసీ బుక్కపట్నం డైట్ కళాశాలలో చదివారు. ఓపెన్ డిగ్రీ, బీఈడీ చేశారు. అనంతపురంలో శిక్షణ తీసుకున్నారు. డీఎస్సీలో దివ్యశ్రీ జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ధర్మవరం వైఎస్సార్ కాలనీకి చెందిన చేనేత కుటుంబానికి చెందిన ఉక్కిశిల సంగప్ప, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు సాయికుమార్ డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో 92.70 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. పదో తరగతి, ఇంటర్ ధర్మవరంలో పూర్తిచేసిన సాయికుమార్ బుక్కపట్నం డైట్ కళాశాలలో టీటీసీ పూర్తి చేశారు. అనంతపురంలో శిక్షణ పొంది డీఎస్సీ పరీక్షలో ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచారు. దీంతో తల్లిదండ్రులు తమ కుమారుడికి స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్నారు.

అక్కా తమ్ముడికి ఉద్యోగాలు


విజయలక్ష్మి


శ్యాంసుందర్‌నాయక్

హిందూపురం: ఒకే ఇంట్లో అక్కా తమ్ముడు డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు సాధించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న బాలునాయక్, లీలాబాయి దంపతుల సంతానం విజయలక్ష్మి, శ్యాం సుందర్‌నాయక్. శుక్రవారం విడుదలైన మెగా డీఎస్సీలో ఇద్దరికీ ఉద్యోగాలు రావడం విశేషం. ఎస్‌ఏ హిందీ ఎస్‌టీ విభాగంలో విజయలక్ష్మి మొదటి ర్యాంకు సాధించింది. అలాగే ఆమె తమ్ముడు శ్యాం సుందర్‌నాయక్‌కు ఎస్‌ఏ ఇంగ్లిష్‌లో 4వ ర్యాంకు వచ్చింది. డీఎస్సీ కోసం హిందీ విభాగం కోసం విజయలక్ష్మి విజయనగరంలో కోచింగ్ తీసుకున్నారు. శ్యాం సుందర్ నాయక్ నల్గొండలో శిక్షణ తీసుకున్నారు. డీఎస్సీ కోసం రెండేళ్లు కష్టపడి చదివామని, తప్పకుండా ప్రభుత్వ ఉపాధ్యాయు కావాలనే లక్ష్యంతో ఇతర అవకాశాలు వచ్చినా వదులుకున్నామని విజయలక్ష్మి, శ్యాం సుందర్‌నాయక్ తెలిపారు. కష్టానికి తగిన ఫలితం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. తమ అన్న చంద్రశేఖర్‌నాయక్‌కు కూడా 2018లో డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా పోస్టింగ్ వచ్చిందన్నారు.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు


ఉదయ్‌కుమార్


రేవతి

ముదిగుబ్బ: డీఎస్సీ మెరిట్ లిస్టులో ఇద్దరికి మూడు ఉద్యోగాలు వచ్చాయి. ముదిగుబ్బకు చెందిన ఉదయ్‌కుమార్ డీఎస్సీ ఓకే సారి మూడు ఉద్యోగాలు సాధించాడు. పీజీటీ సోషల్ స్టడీస్‌లో రెండో ర్యాంక్ (73 మార్కులు), అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో 7వ ర్యాంక్ (83.39 మార్కులు), టీజీటీ సోషల్ స్టడీస్‌లో 10వ ర్యాంక్ (79.12 మార్కులు) సాధించి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉదయ్.. 2012 నుంచి డీఎస్సీ పరీక్షలు రాస్తూ ప్రతిసారి తృటిలో ఉద్యోగం కోల్పోతున్నా .. నిరాశ చెందకుండా పట్టుదలతో టీచర్ ఉద్యోగం సాధించారు. అలాగే ఎనుములవారిపల్లికి చెందిన రైతు వీరప్ప కుమార్తె రేవతి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్‌లో 9వ ర్యాంక్, పీజీటీలో 6వ ర్యాంక్, టీజీటీలో 3వ ర్యాంక్ సాధించారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి పట్టుదలతో చదివి టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

నాలుగు పోస్టులకు అర్హత


వేదవ్యాస

పరిగి: మెగా డీఎస్సీలో పరిగి మండలంలోని కొడిగెనహళ్లి వాసి కేవీ వేదవ్యాస ఏకంగా నాలుగు పోస్టులకు అర్హత సాధించారు. పరిగి మండలంలోని కొడిగెనహళ్లిలో నివాసముంటున్న వాసుదేవరావు, శారద దంపతుల కుమారుడు వేదవ్యాస్ (25) డీఎస్సీలో ఏకంగా నాలుగు పోస్టులకు అర్హత సాధించారు. వేదవ్యాస కర్ణాటకలోని మైసూరులో బీఎస్సీ బీఎడ్‌లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సును పూర్తి చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేసిన అనంతరం 2024లో ఉత్తీర్ణులయ్యారు. అదే ఏడాది నిర్వహించిన టెట్ ఎగ్జామ్‌లో 118 మార్కులను సాధించాడు. తాజాగా నిర్వహించిన డీఎస్సీ 2025 పరీక్షలో జోన్–4లో పీజీటీ ఫిజికల్ సైన్సస్ విభాగంలో 69.5 మార్కులతో మొదటి ర్యాంకును సాధించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో 83.23 ర్యాంకుతో జిల్లా స్థాయి మూడో ర్యాంకు, మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌కు టీజీటీ ఫిజికల్ సైన్స్ జోనల్ 4లో 78.73 మార్కులతో రెండో ర్యాంకు, మోడల్ రెసిడెన్సియల్ స్కూల్స్ విత్ బయాలజీ అండ్ ఫిజిక్స్ విభాగంలో 74.75 ర్యాంకుతో మూడో స్థానంలో నిలిచాడు. తాను సివిల్స్ లక్ష్యంగా చదువుతున్నట్లు వేదవ్యాస పేర్కొన్నారు. కాగా వేదవ్యాస తండ్రి వాసుదేవరావు మండలంలోని ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు.

నెట్ సెంటర్ నిర్వహిస్తూనే...


జయప్రకాష్

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన జయప్రకాష్ డీఎస్సీలో 42వ ర్యాంక్ సాధించి (86.6) టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈయన ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఒక వైపు పనిచేసుకుంటూనే మరోవైపు తాను కలగన్న లక్ష్యం వైపు అడుగులేస్తూ ఆఖరికి ఉద్యోగం సాధించారు.